



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 22 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 198 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY AUGUST 22 2026 | VOL:18 | ISSUE: 198 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా.. పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్

పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ

ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా

జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ

పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన



(మిగతా 2వ పేజీలో..)

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. తెలంగాణలో 28 వరకు వానలు!

బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం

తెలంగాణలోని 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు

బంగాళాఖాతంలో ఏర్పడిన



(మిగతా 2వ పేజీలో..)

# కొండా ఫ్యామిలీపై రేవంత్ రెడ్డి సీరియస్.. చర్యలు తప్పవని హెచ్చరిక!

క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించిన కాంగ్రెస్ అధిష్ఠానం

కఠిన చర్యలు తప్పవని పార్టీ ముఖ్య నేతలకు స్పష్టం చేసిన సీఎం

మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన పీసీసీ

సీఎంపై విమర్శలు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని గట్టి సంకేతాలు



మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పరకాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తద్వారా రేవూరి అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేస్తూ

(మిగతా 2వ పేజీలో..)

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే అనుమతి ఇవ్వలేదు.. విదేశాంగ శాఖ క్లారిటీ

రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎంఈఏ అనుమతి నిరాకరణ

పర్యటన కార్యక్రమం హోదాకు, ఉద్దేశానికి తగినట్లు లేదని కేంద్రం స్పష్టీకరణ

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి

అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని సీఎంవో ప్రకటన

ప్రస్తుతం లండన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

(మిగతా 2వ పేజీలో..)

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు: కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత

రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ

'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న

పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం



(మిగతా 2వ పేజీలో..)

## టాలీవుడ్‌లో విషాదం.. దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

చెన్నై కావేరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

శుక్రవారం మధ్యాహ్నం మరణించినట్లు నాజర్ వెల్లడి

వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన దిగ్గజ నటి

తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో తనదైన ముద్ర వేసిన దిగ్గజ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో ఇటీవలే ఆమె చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచినట్లు నటీనటుల సంఘం అధ్యక్షుడు



(మిగతా 2వ పేజీలో..)

## ఎమ్మెల్యేలకు ఫ్రీగా కార్లు ఇస్తామన్న సీఎం విజయ్.. వద్దన్న ఉదయనిధి స్టాలిన్



తమిళనాడులో ఎమ్మెల్యేలందరికీ ఉచిత కార్లు ఇస్తామన్న సీఎం విజయ్

డ్రైవర్, ఇంధనం కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ ప్రకటన

రాష్ట్ర అప్పులను గుర్తుచేస్తూ.. కార్లు వద్దని తెలిపిన ఉదయనిధి స్టాలిన్

తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య వాహనాల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ ఖర్చుతో కార్లు అందజేస్తామని ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రకటనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను తమ పార్టీ తిరస్కరిస్తున్నట్లు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు.శుక్రవారం అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 234 మంది ఎమ్మెల్యేలకు నియోజకవర్గ పనుల నిమిత్తం ప్రభుత్వ వాహనాలు సమకూర్చుతామని ప్రకటించారు. వీటితో పాటు

(మిగతా 2వ పేజీలో..)

## కుమార్తె వ్యాఖ్యల వివాదం.. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మాట్లాడతానన్న కొండా సురేఖ


క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చానన్న కొండా సురేఖ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చాకే పూర్తి వివరాలు వెల్లడిస్తానని స్పష్టీకరణ

కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని ఇప్పటికే లేఖలో పేర్కొన్న మంత్రి

ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎం, కాంగ్రెస్ అధిష్ఠానం

తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ విషయంపై తాను చెప్పాల్సింది ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరించానని, ప్రస్తుతం మీడియా ముందు మాట్లాడేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై స్పందిస్తానని



(మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# సీఏఏ అమలు వేగవంతం

**జిల్లా స్థాయికి బాధ్యతల బదిలీ**

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) 2019 మళ్లీ చర్చల్లోకి వస్తోంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆగస్టు 19న జారీ చేసిన ఉత్తర్వులతో ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పౌరసత్వ దరఖాస్తుల పరిశీలన, పరిష్కార బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించింది కేంద్ర హోం శాఖ. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, అస్సాం (గిరిజన ప్రాంతాలు మినహా), త్రిపుర (గిరిజన ప్రాంతాలు మినహా), జమ్మూకశ్మీర్, లడఖ్‌లలోని కలెక్టర్లకు ఈ అధికారాలు కల్పించారు. ఇది సీఏఏ అమలును జిల్లా స్థాయికి తీసుకువచ్చి వేగవంతం చేసే ప్రయత్నంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు సాధికార కమిటీలు, జిల్లా స్థాయి కమిటీలు ఈ దరఖాస్తులను పరిశీలించేవి. తాజా నోటిఫికేషన్‌తో ఆ కమిటీల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నేరుగా కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశించారు. పౌరసత్వ (మూడవ సవరణ) నిబంధనలు, 2026 ప్రకారం కలెక్టర్లు సెక్షన్ 6బీ కింద దరఖాస్తులను స్వీకరించి, పత్రాలు పరిశీలించి, అవసరమైన విచారణ చేసి, అర్హతపై సంతృప్తి చెందితే పౌరసత్వం మంజూరు చేసే అధికారం కలిగి ఉంటారు. తగిన అవకాశాలు ఇచ్చినా... దరఖాస్తుదారుడు హాజరుకాకుండా, సంతకం చేయకుండా, విధేయతా ప్రమాణం పూర్తి చేయకుండా ఉంటే దరఖాస్తును తిరస్కరించవచ్చు. గతంలో జారీ చేసిన కొన్ని ఉత్తర్వులను రద్దు చేయడం ద్వారా కేంద్రం ఈ ప్రక్రియను సరళీకరించింది. అయితే 2024 లో అమలులోకి వచ్చిన సీఏఏ నిబంధనలను అమలు చేయడానికి జారీ చేసిన ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. సీఏఏ, ఎన్ ఆర్ సీ పట్ల గతం లో దేశ వ్యాప్తంగా వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. కాబట్టి ఈ సారీ సీఏఏ పట్ల వ్యతిరేకత రాకుండా కేంద్ర ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. పకడ్బందీ గా అమలు చేయాలని చూస్తోంది. సీఏఏ కింద పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి 2014 డిసెంబర్ 31లోపు భారత్‌కు వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులకు పౌరసత్వం కల్పించాలన్నది కేంద్రం లక్ష్యం. స్థానిక అధికారులకు అధికారాలు ఇవ్వడం వల్ల దరఖాస్తుల పరిష్కారం వేగవంతం కావచ్చు. అయితే ఈ ప్రక్రియలో పారదర్శకత, న్యాయం, సమానత్వం నిలవాలి. దరఖాస్తుదారులకు తగిన అవకాశాలు, సమాచారం అందుబాటులో ఉండాలి. అనవసరమైన ఆలస్యాలు, వివక్షత లేకుండా చూడాలి. సీఏఏ అమలు ఎప్పుడూ రాజకీయ చర్చలకు దారితీస్తూ వచ్చింది. కొన్ని రాష్ట్రాలు, వర్గాలు దీన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. అయినా చట్టం చెల్లుబాటులో ఉన్నంత వరకు దాని అమలు సక్రమంగా, సమర్థవంతంగా జరగాలి. జిల్లా కలెక్టర్లకు అధికారాలు ఇవ్వడం ద్వారా కేంద్రం ప్రక్రియను వికేంద్రీకరించి వేగవంతం చేయాలని భావిస్తోంది. ఇప్పుడు ఆయా రాష్ట్రాలు, జిల్లా పరిపాలనలు ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలి. పౌరసత్వం అనేది ప్రాథమిక హక్కు. దాని మంజూరు ప్రక్రియలో ఎలాంటి అసమానతలు లేకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. తాజా నిర్ణయం ఆ దిశగా ఒక అడుగు కావచ్చు---అయితే దాని అమలు ఎంత సమర్థవంతంగా జరుగుతుందోననేది కాలం నిర్ణయిస్తుంది.

–సమీ, సీనియర్ జర్నలిస్ట్.

# కొండా ఫ్యామిలీపై రేవంత్ రెడ్డి సీరియస్.. చర్యలు తప్పవని హెచ్చరిక!

**మొదటి పేజీ తరువాయి)**

స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేలా.. ఆ మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గంలో సభ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది.సీఎం పర్యటనకు స్థానిక మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు కావడం, ఆ వెంటనే ఆమె కుమార్తె ఈ వ్యాఖ్యలు చేయడం ఒక ప్రణాళిక ప్రకారమే జరిగిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ పరిణామాలపై బుధవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్.. అక్కడే కొందరు ముఖ్య నేతల వద్ద తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరికొందరు సీనియర్ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి, ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు చెప్పారని సమాచారం.సీఎం ఆదేశాల మేరకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ వెంటనే రంగంలోకి దిగింది. మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని కోరింది. అయితే, "కుమార్తె చేసిన వ్యాఖ్యలకు నేనెలా బాధ్యురాలిని అవుతాను?" అని మంత్రి సురేఖ గురువారం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.ఈ విషయంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించుకోవడం సరికాదు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. మంత్రి సురేఖ వివరణను పరిశీలించాక తదుపరి చర్యలపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది" అని స్పష్టం చేశారు.

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు: కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి)**

సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు."సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

## కుమార్తె వ్యాఖ్యల వివాదం.. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మాట్లాడతానన్న కొండా సురేఖ

**మొదటి పేజీ తరువాయి)**

ఆమె తెలిపారు.వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన విమర్శలపై పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై సురేఖ ఇప్పటికే కమిటీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని ఆమె ఆ లేఖలో కోరినట్లు సమాచారం.అయితే, ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వర్గాల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. కేవలం నోటీసులతోనే సరిపెట్టకుండా, క్రమశిక్షణా చర్యలు మరింత కఠినంగా ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే అనుమతి ఇవ్వలేదు.. విదేశాంగ శాఖ క్లారిటీ

**మొదటి పేజీ తరువాయి)**

(ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా కార్యక్రమం ఉండాలని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణానికి అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందే హైదరాబాద్ చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. ఈ పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

## ఎమ్మెల్యేలకు ఫ్రీగా కార్లు ఇస్తామన్న సీఎం విజయ్.. వద్దన్న ఉదయనిధి స్టాలిన్

**మొదటి పేజీ తరువాయి)**

డ్రైవర్, ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక నేపథ్యం లేని కొత్త ఎమ్మెల్యేలకు ఇది ఎంతో ఊరటనిస్తుందని, పారదర్శకమైన, అవినీతిరహిత పాలనకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది.అయితే, ప్రభుత్వ నిర్ణయంపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రం అప్పుల్లో ఉందని పదేపదే చెబుతున్న టీవీకే ప్రభుత్వం, ఇప్పుడు ఎమ్మెల్యేలకు కార్లు పంపిణీ చేయడమేమిటని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. తమ పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఈ కార్లను తీసుకోబోరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను పరిశీలించి, సొంత వాహనాలు లేని వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించాలని ఆయన సూచించారు. డీఎంకే విమర్శలపై మంత్రి ఆధవ్ అర్జున ఘాటుగా స్పందించారు. ఈ పథకం కింద సొంతంగా కారు లేని ఎమ్మెల్యేలకు మాత్రమే వాహనాలు కేటాయిస్తామని ఆయన స్పష్టతనిచ్చారు. ఇది విలాసం కాదని, ప్రజాసేవకు అవసరమైన కనీస సదుపాయమని వ్యాఖ్యానించారు. అనేక బంగ్లాలు ఉన్నప్పటికీ ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఎందుకు నివసిస్తున్నారని ఆయన నిలదీశారు. ముఖ్యంగా చిన్న పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ వాహనాలు ఎంతో అవసరమని ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది.

## టాలీవుడ్‌లో విషాదం.. దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

**(మొదటి పేజీ తరువాయి)**

నాజర్ ప్రకటించారు. రాజమహేంద్రవరానికి చెందిన శంకరమంచి జానకి, సినీ రంగంలో 'షావుకారు జానకి'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1950లో ఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన తెలుగు చిత్రం 'షావుకారు'తో ఆమె వెండితెర అరంగేట్రం చేశారు. ఆ సినిమా విజయం తర్వాతే ఆమె పేరుకు ముందు 'షావుకారు' చేరింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఆమె సుదీర్ఘ సినీ ప్రయాణం సాగింది. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరతో పాటు బుల్లితెరపైనా నటించారు. ఇటీవల కూడా తెలుగు సినిమాల్లో కనిపించారు. ఆమె చివరిసారిగా 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' చిత్రంలో నటించారు.మొత్తంగా షావుకారు జానకి 450కు పైగా సినిమాల్లో నటించారు. నాలుగు తరాల నటీనటులతో కలిసి పనిచేసిన ఘనత ఆమె సొంతం. ఏంజీఆర్, జయలలిత, ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్, శివాజీ గణేశన్, రాజ్‌కుమార్ వంటి దగ్గజాలతో స్క్రీన్ చేసుకున్న నటిగా ఆమె రికార్డు సృష్టించారు. సినీ రంగానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2022లో ఆమెకు పద్మశ్రీ పురస్కారం అందించింది. దశాబ్దాల పాటు సాగిన ఆమె నటనా ప్రస్థానం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. తెలంగాణలో 28 వరకు వానలు!

అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం కారణంగా తెలంగాణలో నేటి (ఆగస్టు 21) నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది.ప్రధానంగా అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, పోలవరం ప్రాంతాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తా జిల్లాల్లో చెదురుమదురు జల్లులు పడతాయని వివరించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా.. పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్–జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు.జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# రూపా రెడ్డి హత్యను ఖండిస్తూ ట్రస్మా ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఆగస్టు 21. విజయ కెరటం.**

నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో శుక్రవారం భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని రూపా రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని, సంఘీభావాన్ని తెలియజేశారు. వేలాది మంది పాల్గొనడంతో ర్యాలీకి భారీ స్పందన లభించింది. విద్యాసంస్థల్లో పనిచేసే ప్రతి ఒక్కరి భద్రతకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలలో పనిచేస్తున్న యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూపా రెడ్డి హత్య అత్యంత బాధాకరమైన ఘటన అని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని అన్నారు. నిందితులకు చట్టపరంగా కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యారంగంలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయురాలిపై జరిగిన ఈ దారుణం సమాజం మొత్తాన్ని కలచివేసిందన్నారు. రూపా రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాసంస్థల్లో పనిచేసే ప్రతి ఒక్కరికీ భద్రత కల్పించడం అత్యంత ప్రాధాన్యత అంశమని పేర్కొన్నారు. ట్రస్మా రాష్ట్ర నాయకులు కొలనుపాక రవికుమార్ మాట్లాడుతూ, రూపా రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు విద్యా సమాజం అండగా ఉంటుందని అన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం, పోలీస్ శాఖలు వేగంగా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు ముక్కముల రామ్మోహన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రూపా




రెడ్డి హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ట్రస్మా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లుబెల్లి శ్యామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఘటనపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రూపా రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు విద్యా రంగం తరఫున తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ట్రస్మా నల్లగొండ టౌన్ ప్రెసిడెంట్ నింబారి రమేష్ రెడ్డి మాట్లాడుతూ, నల్లగొండ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో సంఘీభావ ర్యాలీలో పాల్గొని తమ ఐక్యతను చాటారని తెలిపారు. రూపా రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ పాఠశాలల యాజమాన్యాల భాగస్వామ్యం అయ్యారు. ఈ సంఘీభావ ర్యాలీలో నల్లగొండ పట్టణం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన వివిధ ప్రైవేట్ పాఠశాలల వ్యవహర్తలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారంతా "రూపా రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి -- నిందితులను కఠినంగా శిక్షించాలి" అంటూ నినాదాలు చేస్తూ తమ సంఘీభావాన్ని తెలిపారు. విద్యా రంగానికి చెందిన ప్రతి ఒక్కరి భద్రత, గౌరవం, హక్కుల కోసం ఐక్యంగా నిలబడతామని టస్మా నాయకులు స్పష్టం చేశారు.

## ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం చెల్లింపు వేగవంతం చేయాలి

నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ఇంజనీరింగ్ ,రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇదే విషయమై రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని 8 ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ నిధులు విడుదలైనందున, ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ భూసేకరణకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో మాట్లాడి పరిష్కరించాలని చెప్పారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ. 2,800 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని వెల్లడించారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు



వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవిన్యూ అధికారి దశరథ, ఏ ఎమ్మార్పీ ఎస్ ఈ జె. సాల్మన్ రాజు, తదితరులు హాజరయ్యారు.

## వరకట్న వేధింపులు, కుల దూషణ కేసులో నలుగురికి 18 నెలల జైలు శిక్ష.. ..

నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వరకట్న వేధింపులు, వరకట్న నిషేధ చట్టం మరియు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నలుగురు నిందితులకు నల్లగొండ ప్రత్యేక సెషన్స్ కోర్టు శిక్ష విధించిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 24/2021, సెషన్స్ కేసు నంబర్ 41/2021లో IPC 498-A, Dowry Prohibition Act సెక్షన్లు 3, 4 మరియు SC/ST (POA) Act సెక్షన్ 3(1)(తీ)(ం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులు A-1 కల్లూరి స్వామి నాథ్, A-2 ప్రమీల, A-3 కల్లూరి యాదయ్య, A-4 కల్లూరి ఎల్లయ్యలను నేరస్థులుగా నిర్ధారించిన గౌరవ ప్రత్యేక సెషన్స్ జడ్జి, SC/ST కోర్టు కమ్ II అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, శుక్రవారం తీర్పు వెలువరించారు. IPC 498-A కింద ఒక్కొక్కరికి 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ. 1,000 చొప్పున జరిమానా. జరిమానా చెల్లించకపోతే అదనంగా 15 రోజుల జైలు శిక్ష. Dowry Prohibition Act సెక్షన్ 3 కింద ఒక్కొక్కరికి 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ. 1,000 చొప్పున జరిమానా. జరిమానా చెల్లించకపోతే అదనంగా 15 రోజుల జైలు శిక్ష. SC/ST (POA) Act సెక్షన్ 3(1)(r)(s) కింద ఒక్కొక్కరికి 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ. 1,000 చొప్పున జరిమానా. జరిమానా చెల్లించకపోతే అదనంగా 15 రోజుల జైలు శిక్ష. నలుగురు నిందితులపై విధించిన మొత్తం జరిమానా రూ. 12,000. మూడు నేరాలకు విధించిన శిక్షలు 6ం6ం6=18 నెలలు అయినప్పటికీ, అన్ని శిక్షలు ఏకకాలంలో (concurrently) అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో నిందితులు 6 నెలల జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఈ కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పకడ్బందీ ఆధారాలను కోర్టులో సమర్పించడంలో కీలకంగా పనిచేసిన ఎ. రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ ఆఫ్ పోలీస్ (ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారి), జి. వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌డీపీఓ, నల్లగొండ (దర్యాప్తు అధికారి), కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించిన దర్శనం నర్సింహా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఎస్సీ/ఎస్టీ కోర్టు, నల్లగొండ, అలాగే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కె. శివరాం రెడ్డి, ఎస్‌డీపీఓ, నల్లగొండ, కె. ఆది రెడ్డి, సీఐ ఆఫ్ పోలీస్, నల్లగొండ-II (టౌన్) సర్కిల్, బి. శివ ప్రసాద్, ఎస్ఐ ఆఫ్ పోలీస్, నల్లగొండ రూరల్ పీఎస్, కేసు కోర్టు ప్రాసెస్‌లో సమన్వయంతో విధులు నిర్వహించిన డిసిఆర్బి సీఐ శ్రీను నాయక్, కె. దుర్గారాజు, కోర్టు డ్యూటీ ఆఫీసర్, నల్లగొండ రూరల్ పీఎస్, లైజన్ అధికారులు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తును శాస్త్రీయ పద్ధతుల్లో, నిష్పక్షపాతంగా చేపట్టి, నేరం రుజువయ్యేలా పకడ్బందీ ఆధారాలు సేకరించడంతో నిందితులకు శిక్ష పడేలా చేయగలిగామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## నల్లగొండ జిల్లా కోర్టు మందు ఐలు ఆధ్వర్యంలో నిరసన.

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . ఆగస్టు 21 . విజయ కెరటం.**




బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా అనుస రిస్తున్న ఏకపక్ష, అప్రజాస్వామిక, రాజకీయ పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నల్లగొండ జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కోర్టు మందు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆద్వర్యంలో నిరసన కార్యక్రమం చెయడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ మనన్ కుమార్ మిశ్రా పద్నాలుగు సంవత్సరాలకు పైగా బీసీఐ చైర్మన్ గా కొనసాగుతూ, చట్టబద్ధమైన ప్రజాస్వామిక సంస్థలో అధికారాన్ని వ్యక్తిగతంగా కేంద్రీకరించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదని, దేశంలోని న్యాయవాదులందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని తెలిపారు. బీసీఐ అధికారిక పదవి, లెటర్హెడ్ను రాజకీయ ప్రకటనలకు ఉపయోగించడం సంస్థ స్వతంత్రతను, విశ్వసనీయతను దెబ్బతీస్తుందని విమర్శించారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ పట్టభద్రులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడం పూర్తిగా ఏకపక్షమైన, చట్టవిరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు శాంతియుతంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు మొత్తం బ్యాచ్ను శిక్షించడం రాజ్యాంగ విలువలకు, న్యాయవాదుల చట్టం-1961 నిబంధనలకు విరుద్ధమన్నారు. అనంతరం ఆదేశాల ను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పినప్పటికీ, విద్యార్థుల వృత్తిపరమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత నుంచి చైర్మన్ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులను నామినేషన్ల ద్వారా అధికారస్థానాల్లో నియమించడం, ఎన్నికల ఫలితాల తర్వాత సభ్యుల సంఖ్యను పెంచి ఓడిపోయిన అభ్యర్థులను కౌన్సిళ్లలో కి తీసుకురావడానికి ప్రయత్నించడం ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమన్నారు. న్యాయవిద్య ప్రమాణాలు, న్యాయ కళాశాలల తనిఖీలు, అనుమతులు, విరాళాల సేకరణకు సంబంధించి వస్తున్న తీవ్రమైన ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీసీఐ ప్రజాస్వామిక, స్వతంత్ర, చట్టబద్ధ స్వభావాన్ని పరిరక్షించేందుకు, మనన్ కుమార్ మిశ్రా రాజకీయ పక్షపాత-అప్రజాస్వామిక వ్యవహారశైలికి నిరసన వ్యక్తం చేయడం జరిగింది అని అన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోల్పోయిన గౌరవం, విశ్వసనీయత, ప్రజాస్వామిక స్వభావాన్ని పునరుద్ధరించేందుకు మనన్ కుమార్ మిశ్రా వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఐలు జిల్లా ఉపాధ్యక్షులు పందెనపల్లి బ్రహ్మచారి జిల్లా నాయకులు డి నర్సాజి, భీమగాని గణేష్, ఎన్ రాములు, పి శేఖర్, దుర్గాప్రసాద్, మురళీకృష్ణ, నాగరాజు, స్వామినాథ్, సతీష్, నితీష్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

## కేసులో సాయం చేస్తా రూ.30,000 ఇవ్వు..
## గలీజ్ దందాకు తెరలేపిన రాజంపేట ఎస్ఐ

**ఇంట్లోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ కరప్షన్ కింగ్**

చట్టాన్ని రక్షించాల్సిన ఓ ఖాకీ లంచం బారినపడి ఏసీబీ వలకు చిక్కాడు. కేసులో సాయం చేసేందుకు బాధితుడి నుంచి రూ. 30,000 నగదు లంచం తీసుకుంటూ కామారెడ్డి జిల్లా రాజంపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) దువ్వల ఆంజనేయులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రాజంపేట పీఎస్ పరిధిలో నమోదైన ఓ కేసులో ఫిర్యాదుదారుని కుమారుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసేందుకు, అలాగే తదుపరి చార్జ్‌షీట్ దాఖలు చేసే సమయంలో అనుకూలంగా ఉండేందుకు ఎస్ఐ దువ్వల ఆంజనేయులు భారీగా లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఎంత వేడుకున్నా ఆయన కనికరించలేదు. విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి తన గోడును వెళ్లబోసుకున్నారు. ఏసీబీ అధికారుల పక్కా ప్రణాళిక ప్రకారనం... గురువారం ఎస్ఐ ఆంజనేయులు తన నివాసంలో బాధితుడి నుంచి రూ. 30,000 లంచం తీసుకుంటుండగా అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో ఎస్ఐ రంగు చేతులతో పట్టుబడ్డారు. ఆయన్నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. అనంతరం నిందితుడైన ఎస్ఐ ఆంజనేయులును అరెస్టు చేసి, హైదరాబాద్ నాంపల్లిలోని ఎస్పీఈ ఢ ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ శాఖల్లో ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ముందుకు రావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

# షరీఫ్‌ను పోలీస్ ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగింపు

**ఖాకీలైనా కఠినమే**

**జిల్లా ఎస్పీ నరసింహ**

**సూర్యాపేట (విజయ కెరటం-సీనియర్ జర్నలిస్ట్ గౌస్)**



సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్‌ను పోలీస్ ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగిస్తూ (డిస్మిస్) జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోతే మండల కేంద్రంలోని ఒక వ్యవసాయ భూమిలో పాతిపెట్టిన భార్యాభర్తల మృతదేహాల ఘటనపై మోతే పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో అత్యంత వేగంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరానికి పాల్పడిన నిందితులను పట్టుకుని, వారిని రిమాండ్‌కు తరలించడం జరిగింది. ఈ దారుణ హత్య ఉదంతంలో మోతే పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షరీఫ్ ప్రధాన నిందితుడిగా తేలడం, అతను ప్రస్తుతం రిమాండ్‌లో ఉండడంతో ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించింది. చట్టాన్ని రక్షించాల్సిన స్థానంలో ఉండి ఇటువంటి ఘాతుకానికి ఒడిగట్టడం తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా భావిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ నరసింహ సదరు కానిస్టేబుల్‌ను ఉద్యోగం నుండి తొలగిస్తూ తక్షణ ఆదేశాలు జారీ చేశారు. కేసులో ఎస్సీ , ఎస్టీ అట్రాసిటి సెక్షన్ లు పెట్టడం జరిగినది.డిఎస్పీ నీ కేసు దర్యాప్తు అధికారిగా నియమించాం.కేసులో త్వరగా తీర్పు రావడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు కు పంపుతాం. నేరస్థులకు త్వరగా కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నాం.బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా కంపెంజేశన్ త్వరగా వచ్చేలా చర్యలుతీసుకున్నాం.శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా సొంత శాఖకు చెందిన వారైనా సరే ఉపేక్షించేది లేదని, చట్టం ముందు అందరూ సమానులేనని ఈ చర్య ద్వారా జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది.

# CPS అంతానికి పంచాయతీరాజ్ ఉద్యోగులు ఉద్యమించాలి

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు

సిపిఎస్ అంతానికి పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించాలని పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు అన్నారు. ఈనెల 23న హైదరా బాద్ లోని ఎల్బీ స్టేడియంలో జరిగే సిపిఎస్ ఉద్యోగుల బహిరంగ సభను విజయవంతం చేయుటకు శుక్రవారం జిల్లా పరిషత్ ఉద్యోగులతో, నల్లగొండ జిల్లా సిపిఎస్ ఉద్యమ నాయకుడు కిరణ్ కుమార్ తో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సిపిఎస్ విధానం ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రాణ సంకటంగా మారిందన్నారు. సిపిఎస్ పెన్షన్ విధానం రద్దు చేయుటకు అన్ని శాఖలలోని ఉద్యోగులు ఐక్యమై జేఏసీగా ఏర్పడి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణలోని సిపిఎస్ ఉద్యోగులు మరో తెలంగాణ ఉద్యమం లా ఉద్యమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు పంచాయతీరాజ్ ఉద్యోగుల పక్షాన పూర్తి మద్దతు ఉంటుందని వారు చేసే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాలుపంచుకుంటామని తెలిపారు. ఈనెల 23న హైదరాబాద్ లోని ఎల్. బి స్టేడియంలో జరిగే సిపిఎస్ ఉద్యోగుల బహిరంగ సభకు నల్గొండ జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, నల్గొండ జిల్లా పరిషత్ =బొ ణజు సంపత్ కుమార్ సూపరిండెంట్ సురేందర్ రెడ్డి శ్రీనివాస్ చారి ఉద్యోగులు హరినాథ్ శ్రీనివాస్ ప్రవీణ్ విజయ్ శోభ విజయభాస్కర్ రెడ్డి వెంకట్ రెడ్డి ఎండి గులాం రబ్బాని రేఖ రేణుక ప్రకాష్ రజిత భాగ్యలత ఇతర పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు



# ఎల్లాపురంలో రోడ్డు పనులకు శంకుస్థాపన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**సూర్యాపేట (విజయ కెరటం-సీనియర్ జర్నలిస్టు గౌస్)**



హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పాలకవీడు మండల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాగు, తాగునీటితో పాటు రహదారులు, విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. పాలకవీడు మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పాలకవీడు ప్రజలపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని, అందుకే మండలానికి అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రూ.600 కోట్లతో చేపట్టిన జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే సుమారు 10 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుతో వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. ఇళ్ల కేటాయింపులో పారదర్శకత హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రెండు విడతల్లో 5 వేల ఇళ్లుమంజూరయ్యాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి బూత్‌కు 15 ఇళ్ల చొప్పున కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇళ్లు అవసరం లేని ప్రాంతాల్లోని కోటాను అవసరం ఉన్న ప్రాంతాలకు మళ్లిస్తామని స్పష్టం చేశారు. ఎనిమిది నెలల్లో రోడ్డు పూర్తి గుడుగుంట్లపాలెం--సింగారం--ఎల్లాపురం స్టేజీ వరకు 8 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.18 కోట్లతో చేపట్టే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రెండు కిలోమీటర్లు సీసీ రోడ్డు, ఆరు కిలోమీటర్లు డాంబర్ డబుల్ రోడ్డుగా నిర్మించనున్నట్లు తెలిపారు. పనులను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఎల్లాపురం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఇప్పటికే రూ.3.20 కోట్లతో సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పెండెం వెంకటరమణ, పంచాయతీరాజ్ ఈఈ వెంకటయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి, సర్పంచులు సుజాత, పెరుమాళ్ల సురేష్, తహసీల్దార్ వాజిద్ అలీ, ఎంపీడీఓ లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ నాగిని, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి మాలోత్ మోతిలాల్, బెల్లంకొండ నరసింహారావు, నాగిరెడ్డి, జితేందర్‌రెడ్డి, డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సీఏజీఎం నాగమల్లేశ్వరరావు, శశిరెడ్డి, వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఎల్లాపురం ఉపసర్పంచ్ చాందిని అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



# రజనీకాంత్ ‘జైలర్ 2’ నుంచి ఫస్ట్ సింగిల్.. ‘అల బొలెలో’ సాంగ్ ఇదిగో.. పూర్ణ స్టెప్పులు అదుర్స్!

**తలైవా హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో భారీ చిత్రం జైలర్-2**

**తొలి పాట ‘అల బొలెలో’ విడుదల**

**అనిరుధ్ సంగీతంలో వచ్చిన ఈ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ**

**ప్రత్యేక ఆకర్షణగా నటి పూర్ణ డ్యాన్స్ ప్రదర్శన**

**అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల**

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘జైలర్ 2’ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట ‘అల బొలెలో’ను శుక్రవారం విడుదల చేసి అభిమానులకు పండగలాంటి వార్త చెప్పింది.యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ ఫుట్ ట్యాపింగ్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. దర్శకుడు అరుణ్‌రాజా కామరాజ్ దీనికి సాహిత్యం అందించారు. అయితే, ఈ పాటలో సంగీతం, సాహిత్యం కంటే ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సమకూర్చిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా నటి పూర్ణ (షామ్నా కాసిం) తన అద్భుతమైన డ్యాన్స్‌తో, హావభావాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆమె డ్యాన్స్ పాటకు ప్రత్యేక కళను తెచ్చిపెట్టింది.ఈ చిత్రంలో భాగం కావడంపై నటి పూర్ణ ఇటీవల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "‘జైలర్ 2’ లాంటి భారీ చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఇది ఒక కల నిజమైనట్లుంది" అంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు రజినీకాంత్, దర్శకుడు నెల్సన్, అనిరుధ్, జానీ మాస్టర్‌తో పాటు చిత్ర బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.కాగా, ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. గతంలో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్‌లో నటుడు వినాయకన్ చెప్పిన డైలాగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్!" అంటూ ఆయన చెప్పే డైలాగ్, ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్ ఎంట్రీ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ‘జైలర్ 2’ షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528